క్లుప్తంగా


వితరణ



విద్యార్థులకు పరుపులు అందజేస్తున్న విజయనగరం కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

విజయనగరం: రక్షాబంధన్ పురస్కరించుకుని, స్థానిక ఫూల్‌బాగ్ కాలనీలోని ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూల్ దివ్యాంగ(బధిరులు) విద్యార్థులకు అవసరమైన బెడ్ పరుపులను విజయనగరం కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి శనివారం వితరణ చేశారు. అంతకు ముందు విద్యార్థులకు రాఖీలు కట్టి, శుభాకాంక్షలు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మహిళా నాయకులు దమయంతి, ఉషారాణి, అనూష, సుజాత, కృష్ణవేణి, జ్యోతి, నందిని, పరమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విఖనసస్వామి జయంతి



పూజలందుకుంటున్న విఖనసస్వామి

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీసీతా రామస్వామి దేవస్థానంలో కొలువైన విఖనసస్వామి జయంతి శనివారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సీతారామస్వామి వారికి ప్రాతఃకాలార్చన పూజలు నిర్వహించినానంతరం యాగశాలలో విశేష హోమాలు చేశారు. శ్రావణ పౌర్ణమి సందర్భంగా ఉత్సవమూర్తుల వద్ద స్వామివారికి నూతన యజ్ఞోపవీతధారణ చేశారు. అనంతరం వెండి మండపం వద్ద సీతారాముల నిత్యకల్యాణం కనుల పండువగా చేశారు. విఖనసస్వామికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, వివిధ రకాల ఫలరసాలతో అభిషేకం చేసి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఈవో శ్రీనివాసరావు, అర్చకులు పాల్గొన్నారు.

స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



విశిష్ట అలంకరణలో వేంకటేశ్వరస్వామి

జామి: వేంకటేశ్వరస్వామి జన్మ నక్షత్రం అయిన శ్రవణ నక్షత్రం, శ్రావణ పౌర్ణమి, శనివారం సందర్భంగా భీమసింగి సుగర్‌ఫ్యాక్టరీ వద్ద ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు గావించారు. ఆలయ ప్రధాన అర్చకులు వరప్రసాద్ ఆచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక అలంకరణగావించి, విశిష్ట పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ప్రసాద వితరణ గావించారు. అన్నంరాజుపేట పుష్పగిరి వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు గావించారు.

ఆదివాసీల సంక్షేమంపై దృష్టి సారించాలి

శృంగవరపుకోట: ప్రకృతి ఒడిలో జీవించే ఆదివాసీల సంక్షేమంపై పాలకులు దృష్టి సారించాలని దళిత ఉద్యమ నేత ఆతపు ఉదయ్‌భాస్కర్ విమర్శించారు. ఎస్.కోటలో ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం స్కూల్ అసిస్టెంట్ మౌలానా అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య, వైద్య, ఉపాధి రంగాల్లో గిరిపుత్రులు వెనుకబడి ఉన్నారన్నారు. ఆదుకోవాల్సిన పాలకులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బహుజన నాయకుల రామకోటి, గుఱ్రపు శ్రీను, పెద్దా సూరిదేముడు, డోల కేశవ, బి.ఈశ్వరరావు, పి.సురేష్, తెరపల్లి సూరిబాబు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్సలు



పశువులకు వైద్యసేవలు అందిస్తున్న వైద్యురాలు

వేపాడ: మండలంలోని కృష్ణారాయుడుపేట గ్రామంలో శనివారం వేపాడ పశువైద్యాధికారి డా. కోరాడ గాయిత్రీ నేతృత్వంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 30 పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్స అందించిన డాక్టరు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. వర్షాకాలంలో పశువులు పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ సిహెచ్ ముసలినాయుడు, పాడి రైతులు, పశుసంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ లోడు తగ్గింపునకు మరో ఛాన్స్!

- కిలోవాట్ విద్యుత్‌కు 50 శాతం రాయితీ
- డిసెంబరు 31వ తేదీ వరకు గడువు
- గతంలో అవకాశమిచ్చినా వినియోగదారుల్లో అవగాహన కరువు
- 1.30 లక్షల సర్వీసులకు వచ్చిన దరఖాస్తులు 1247 మాత్రమే



విజయనగరం: గృహ విద్యుత్ వినియోగదారులకు సువర్ణావకాశం. అదనపు విద్యుత్ లోడు క్రమబద్ధీకరణకు విద్యుత్ శాఖ మరోసారి అవకాశం కల్పించింది. కిలోవాట్ విద్యుత్‌కు 50 శాతం రాయితీతో తగ్గించుకునేందుకు తొలుత మార్చి 1 నుంచి జూన్ 30వ తేదీ వరకు అవకాశం కల్పించింది. అయినా వినియోగదారుల నుంచి అంతంత మాత్రమే స్పందన వచ్చింది. ఈ దఫా డిసెంబరు 31వ తేదీ వరకు గడువు పొడిగించడంతో వినియోగదారులంతా ఈ అవకాశాన్ని అయినా సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు. వాస్తవానికి గృహ వినియోగదారులు తొలుత సర్వీసు పొందే సమయంలో తక్కువ లోడు సామర్థ్యంతో కనెక్షన్ పొందుతారు. తర్వాత ఇంట్లో గృహోపకరణాలు పెరిగే కొద్దీ విద్యుత్ వినియోగం, లోడు రెండూ పెరుగుతాయి. ఆ మేరకు విద్యుత్ లోడు పెంచుకోకుంటే ఆ ప్రాంతంలో లోవోల్టేజి సమస్య తలెత్తుతుంది. క్షేత్రస్థాయిలో సర్వీసులు, లోడు ఆధారంగానే ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తుంటారు. లోవోల్టేజి సమస్య తలెత్తినా అక్కడ లోడు ఎంత ఉందనే అధికారిక లెక్కల ప్రకారం కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తారు. ఈ నేపథ్యంలో వినియోగదారులంతా తప్పనిసరిగా గృహోపకరణాల మేరకు లోడు పెంచుకోవాలని విద్యుత్ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

1.30 లక్షలకు పైగా కనెక్షన్లు..

జిల్లా కేంద్రమైన విజయనగరం కార్పొరేషన్ పరిధిలో డి1, డి2, డి3, డి4, డి5 విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో దాదాపు 1.30 లక్షలకు పైగా కనెక్షన్లు ఉన్నట్లు అధికారిక లెక్కలు వెల్లడిస్తున్నాయి. వీటి పరిధిలోని వినియోగదారుల్లో 50 శాతానికి మించి కనెక్షన్ తీసుకున్న సమయంలో చూపించిన వినియోగం కన్నా అధికంగానే విద్యుత్ వినియోగిస్తున్నారు. అయితే ఇదివరకు ఈ విద్యుత్ అదనపు లోడు క్రమబద్ధీకరణకు అవకాశమివ్వగా, వినియోగదారుల్లో అవగాహన కొరవడింది. కేవలం 1247 దరఖాస్తులు మాత్రమే విద్యుత్ అదనపు లోడు తగ్గించుకునేందుకు అధికారుల దృష్టికి వచ్చాయి.

పెరుగుతున్న విద్యుత్ వినియోగం..

సాధారణంగా కనెక్షన్ ఇచ్చే సమయంలో కిలోవాట్ విద్యుత్ వినియోగానికి గృహాలకు రూ.2 వేలు, దుకాణాలకు రూ.2,500 చొప్పున వసూలు చేస్తారు. చాలామంది గృహ వినియోగదారులు ఈ మొత్తానికి సంబంధించి తమ వినియోగం 1 నుంచి 2 కిలోవాట్ లోపలే చూపిస్తారు. వినియోగంలో అంతకు రెట్టింపు కేటగిరీలో చేరిపోతున్నారు. వాణిజ్య కనెక్షన్లకు సంబంధించిన వినియోగమైతే చూపించిన దానికన్నా ఏకంగా నాలుగింతలు ఉంటోంది. ఇటువంటి వారంతా అదనపు లోడు క్రమబద్ధీకరణ చేసుకోవాల్సిన అవసరం ఉందని విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారు.

తీరనున్న లోవోల్టేజి సమస్య..

గృహాలు, దుకాణాలకు విద్యుత్ కనెక్షన్లు తీసుకునే సమయంలో దీపాలు, ఇతర గృహోపకరణాల వినియోగాన్ని సగటున అంచనా వేసి లోడ్‌లను కిలోవాట్లలో లెక్కించి సెక్యూరిటీ డిపాజిట్, డెవలప్‌మెంట్ చార్జీలు వేస్తారు. అధిక శాతం మంది గృహాలకైతే 1–2 కిలోవాట్లు, దుకాణాలకు 2–3 కిలోవాట్లకు మాత్రమే అనుమతి తీసుకుంటారు. ఈ లెక్క ప్రకారమే ఆయా ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తారు. నగరీకరణ, ఇంట్లో అవసరాలు పెరగడం, దుకాణాలకు సంబంధించి వ్యాపార లావాదేవీలు పెరగడం, వాతావరణ పరిస్థితుల వల్ల అనుమతి తీసుకున్న దానికన్నా అధికంగా విద్యుత్ వినియోగం జరుగుతోంది. వినియోగం అంచనాకు మించడంతో నియంత్రికలపై లోడు ఎక్కువై తరచూ ట్రిప్ కావడం, లోవోల్టేజి సమస్య వస్తోంది.

జరిమానా బెడద ఉండదు..

ఇప్పటివరకు అధిక లోడు నియంత్రణలో భాగంగా విద్యుత్ అధికారులు, సిబ్బంది తరచూ ఇంటింటికీ వెళ్లి తనిఖీలు చేసేవారు. అధిక లోడు వినియోగిస్తున్న వారిని గుర్తించి రుసుముతో పాటు జరిమానా వసూలు చేసేవారు. గత ఐదేళ్లుగా ప్రతినెలా సబ్‌స్టేషన్ పరిధిలో తమకు కేటాయించిన లక్ష్యాల మేరకు రీడింగ్‌లు తనిఖీ చేసి అధిక లోడు వినియోగిస్తున్న వారికి జరిమానా విధిస్తున్నారు. వినియోగదారులే స్వచ్ఛందంగా ముందుకువచ్చి అదనపు లోడును క్రమబద్ధీకరించుకుంటే ఈ అదనపు రుసుములు, జరిమానాల బెడద ఉండదు.

–విజయనగరం ఏడీఈ కిరణ్‌కుమార్

సకల భాషలకు తల్లి సంస్కృతం



సంస్కృత భాషా ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న దృశ్యం

విజయనగరం టౌన్: సకల భాషలకు మూలం, తల్లి వంటిది సంస్కృత భాష అని వాగ్దేవి సమారాధనమ్ సంస్థ వ్యవస్థాపకురాలు, రాజాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పెన్నేటి స్వప్నహైందవి అన్నారు. సంస్కృత భాషా దినోత్సవం పురస్కరించుకుని, నగరంలోని మహారాజా సంస్కృత ఉన్నత పాఠశాలలో సంస్కృత భాషా ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న కర్రి సంతోషిలక్ష్మిని శనివారం ఘనంగా సత్కరించారు. ఇదే కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన డాక్టర్ ఎన్.సూర్యనారాయణ, డాక్టర్ గోటేటి హిమబిందులు మాట్లాడుతూ నేడు మానవులు మాట్లాడుతున్నటువంటి భాషాపదాల్లో 80 శాతం సంస్కృత పదాలేనని తెలిపారు. సంస్కృతం లేకుంటే మానవ జీవన గమనం కష్టమని రామాయణం, మహాభారతం, భాగవతాలు కూడా తొలుత సంస్కృతంలోనే లభ్యమయ్యాయన్నారు.

సూపర్‌స్టార్ మహేష్‌బాబు అభిమానుల రక్తదానం



రక్తదానం చేస్తున్న మహేష్‌బాబు అభిమానులు

విజయనగరం టౌన్: ప్రముఖ సినీహీరో సూపర్‌స్టార్ మహేష్‌బాబు 50వ పుట్టిన రోజు పురస్కరించుకుని, ఆయన అభిమానులు స్థానిక న్యూలైఫ్ బ్లడ్ బ్యాంక్‌లో శనివారం రక్తదానం చేశారు. అలాగే అగ్నిమాపక కేంద్రం వద్ద పట్టణ నిరాశ్రయుల వసతిగృహం వద్ద కేక్ కట్ చేసి, మహేష్‌బాబుకు బర్త్‌డే విషెస్ తెలియజేశారు. వృద్ధులకు రొట్టెలు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఇలా పలు సేవా కార్యక్రమాల ద్వారా వారు తమ హీరోపై ఉన్న అభిమానాన్ని చాటుకోవడం ఆనందంగా ఉందని సూపర్‌స్టార్ కృష్ణ, మహేష్‌బాబు, సుధీర్‌బాబు కల్చరల్ అసోసియేషన్ సభ్యుడు డి.హుస్సేన్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌వి.రమణరాజు, డి.రాంబాబు, అప్పారావు, ఈశ్వరరావు, భాస్కర్, సాంబ, గణేష్, రామకృష్ణ, సురేష్, రమేష్, విజయకుమార్, కామేష్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్‌ను ఆప్యాయంగా పలకరించి, ఆరోగ్యం గూర్చి తెలుసుకుంటున్న ఎమ్మెల్సీ పెనుమత్స

నెల్లిమర్ల రూరల్: వైఎస్సార్ కడప జిల్లా, పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నిక ప్రచారంలో కూటమి నాయకులు, కార్యకర్తల దాడిలో గాయపడిన ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్‌ను వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్సీ పెనుమత్స సూర్యనారాయణరాజు(సురేష్‌బాబు) శనివారం కలిసి పరామర్శించారు. విజయవాడలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయనను కలిసి ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నిక ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలని, రమేష్ యాదవ్‌పై దాడికి ఎగబడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎన్నికల కమిషనర్‌ను కోరారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు జిల్లా జట్లు సిద్ధం



రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులతో నిర్వాహకులు

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరగనున్న యోగా పోటీలకు జిల్లా జట్లు సిద్ధమయ్యాయి. జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని తోటపాలెం గాయత్రీ విద్యా సంస్థల ప్రాంగణంలో శనివారం నిర్వహించిన ఎంపిక పోటీలకు అనూహ్య స్పందన లభించింది. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో నిర్వహించిన ఎంపిక పోటీల్లో మొత్తం 100 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వీరికి జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షుడు అవనాపు విక్రమ్, అల్లు నరేంద్ర, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి సిహెచ్.వేణుగోపాలరావు సమక్షంలో ఎంపికలు నిర్వహించారు. ఎంపికల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 35 మంది క్రీడాకారులను వచ్చే నెల 5, 6, 7 తేదీల్లో తాడేపల్లిగూడేంలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షుడు అవనాపు విక్రమ్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి బి.సన్యాసిరావు, ఎస్.రవివర్మ, ఎన్.పైడిరాజు, ఎం.గౌతమి, జి.సంధ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాఖీ పండగ



విజయనగరం: దివ్యాంగ విద్యార్థులకు రాఖీలు కట్టి పండగ శుభాకాంక్షలు చెబుతున్న విజయనగరం కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

వాడవాడలా రాఖీ పండగ సందడి నెలకొంది. అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల ప్రేమానురాగాలు, ఆత్మీయతకు ప్రతీకగా నిలిచే ఈ వేడుకను ఎంతో ఘనంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. శనివారం జరిగిన ఈ ఉత్సవంలో ప్రతి అన్నకు చెల్లి, తమ్ముడికి అక్క రాఖీలు కట్టి, శుభాకాంక్షలు చెప్పుకున్నారు. చిన్నవారు పెద్దవారి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం స్వీట్లు తినిపించుకుని ఇంటిల్లపాది ఆనందంగా గడిపారు.

–విజయనగరం, నెల్లిమర్ల నెట్‌వర్క్



డెంకాడ: సోదరులకు రాఖీలు కడుతున్న సోదరీమణులు



ట్రాఫిక్ పోలీస్‌కు రాఖీ కడుతున్న విద్యార్థినులు



విజయనగరం గంటస్తంభం: విజయనగరంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జరిగిన రక్షా బంధన్ వేడుకల్లో విద్యార్థులు



ఆటోడ్రైవర్‌కు రాఖీ కడుతున్న సోదరి



చిన్నారికి రాఖీ కడుతున్న విద్యార్థులు



అన్నకు రాఖీ కడుతున్న చెల్లి

వైభవంగా శ్రావణ పౌర్ణమి

చీపురుపల్లి: పట్టణంలోని కొత్తఅగ్రహారం ఆర్య సమాజంలో శనివారం శ్రావణ పౌర్ణమిని వైభవంగా నిర్వహించారు. తెనాలికి చెందిన మాఘం కృష్ణమూర్తి నేతృత్వంలో సత్సంగ్, హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ సంప్రదాయంలో శ్రావణ పౌర్ణమి ముఖ్యమైన పండగ అన్నారు. శ్రావణ పౌర్ణమి రోజున యజ్ఞం చేసి, యజ్ఞోపవీతం మార్చుకోవడం సంప్రదాయంగా వస్తోందన్నారు. కార్యక్రమంలో ఆర్యసమాజం అధ్యక్షుడు దన్నాన సత్యనారాయణ, గౌరవాధ్యక్షుడు కుమరాపు అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో...

చీపురుపల్లి: మండలంలోని రామలింగాపురం సమీపంలోని మానసాదేవీ నాగశక్తి అమ్మవారిని ఏపీ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు కుటుంబ సమేతంగా శనివారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. వారికి ఆలయ అర్చకులు అమ్మవారి ఆశీస్సులతోపాటు చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు పిన్నింటి రమణ, శ్రీను పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో కార్డన్ సెర్చ్




గిరిజనులతో మాట్లాడుతున్న పోలీసులు

వేపాడ: మండలంలోని కొండగంగుబూడి గ్రామ పంచాయతీ శివారు గ్రామాలైన సొంటివానిపాలెం, చిట్టివానిపాలెం గ్రామాల్లో ఎస్.కోట రూరల్ సర్కిల్ సీఐ అప్పలనాయుడు ఆధ్వర్యంలో పోలీసులు శనివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు గ్రామాల్లో ప్రతీ ఇంటిలో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా సీఐ అప్పలనాయుడు, ఎస్ఐ సుదర్శనరావు మాట్లాడుతూ ప్రభుత్వ లైసెన్స్‌లు లేకుండా తుపాకీలు వినియోగించవద్దని హితవు పలికారు. ఎవర దగ్గరైనా నాటు తుపాకీలు ఉంటే వేపాడ పోలీస్‌స్టేషన్‌లో అప్పజెప్పాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గుర్ల: మండలంలోని తెట్టంగి, పున్నపు రెడ్డి పేటలో సీఐ శంకరరావు, ఎస్ఐ పి.నారాయణరావు ఆధ్వర్యంలో గుర్ల పోలీసులు శనివారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. నాటు తుపాకీలు ఉపయోగిస్తున్న వారి ఇళ్లలో సోదాలు జరిపారు. అనంతరం గ్రామస్తులతో సమావేశం ఏర్పాటుచేసి ఎటువంటి అనుమతులు లేకుండా నాటు తుపాకీలను ఉపయోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాటు తుపాకీలను కలిగి ఉన్నవారు పోలీసులకు అప్పగించాలని కోరారు.

గిరిజన సమస్యలు పరిష్కరించకుండా ఉత్సవాలా...!



నిరసన తెలుపుతున్న ఆదివాసీలు

శృంగవరపుకోట: గిరిజన సమస్యలు పరిష్కరించకుండా ఆదివాసీ సంబరాలు చేసుకోవడం గిరిజనులకు అన్యాయం చేయడమేనని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ ఆవేదన వ్యక్తం చేశారు.అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం పేరుతో ఒక పక్క సంబరాలు చేస్తుంటే ఎవరికోసమైతే సంబరాలు చేస్తున్నారో.. అదే ఆదివాసీలు జిందాల్ చేసిన మోసాలకు 50 రోజులుగా రోడ్డుపైకి కూడా రాలేని పరిస్థితిలో శివాలయంలో పోలీసులు వలయంలో నిర్బంధించి ఆదివాసీ సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటని అన్నారు. శనివారం బొడ్డవరలో భూములు కోల్పోయిన గిరిజనులతో నిరసన చేపట్టారు. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా నేటికీ గిరిజనులకు ఫలాలు అందడం లేదన్నారు. భూములు కోల్పోయిన గిరిజనులు రోడ్డు పక్కన ఆందోళన చేస్తుంటే వారిని పట్టించుకోని ప్రభుత్వం అధికారులు, ప్రజాప్రతినిధులు ఆదివాసీ దినోత్సవం జరపడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో గిరిజన సాంప్రదాయలతో ఆకులు, అలములతో నిరసన తెలిపారు.